క్లుప్తంగా

ఎంఆర్‌పీపై అదనపు బాదుడు



జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

చిలమత్తూరు: మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు నిర్వాహకులు ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని మద్యం కొనుగోలుదారులు వాపోతున్నారు. బాటిల్‌పై రూ.10, రూ.20 వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. చేసేది లేక అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ



క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు, అధికారి

హిందూపురం టౌన్: మండల పరిధిలోని కిరికెరలోని ఎల్‌ఆర్‌జీ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిక్షణలో పాల్గొన్నారు. తిరుపతి కేంద్రంగా ఈ నెల 6 నుంచి 13 వరకూ నిర్వహించిన శిక్షణకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 510 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్‌ఆర్‌జీ విద్యాలయానికి చెందిన బీఎస్ నీరజ్, ఎం.భరత్‌తేజ్‌తో పాటు అధికారి కేఎస్ హరికుమార్ పాల్గొన్నారు. అటవీ ప్రాంతంలో దాదాపు 150 కిలోమీటర్ల యాత్రను వారు పూర్తిచేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



దేవగానపల్లిలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని దేవగానపల్లిలో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ రామరావు, ఏపీఓ జగదీష్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామరావు మాట్లాడుతూ ఉపాధి పథకం అనుసంధానంతో గ్రామాల్లో ఎంపిక చేసిన వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు, తాళికెర గ్రామ పంచాయితీ పరిధిలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ జగదాంబ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



రాధిక (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామానికి చెందిన శివన్న కుమార్తె రాధిక (16) ఈనెల 12వ తేదీ నుంచి అదృశ్యమైంది. ఈ మేరకు బాలిక తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.రాధిక కొన్నాళ్లుగా హిందూపురం మండలం సేవామందిరంలో ఓ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తోందన్నారు. దసర పండుగాకు స్వగ్రామానికి వచ్చిందని, అయితే 12వ తేదీ ఉంచి కనిపించకుండా పోయిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాల్మీకి విగ్రహాన్ని తొలగించడం అమానుషం



ఇన్‌చార్జ్ తహసీల్దార్ మూర్తికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పావగడ: తుమకూరు జిల్లా కొరటగెరె పట్టణంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఇటీవల ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహాన్ని తొలగించడం అమానుషమని స్థానిక వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు లోకేశ్ పాళేగార్ అన్నారు. ఘటనకు నిరసనగా స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అధికారులు వాల్మీకి విగ్రహాన్ని తొలగించి తమ సామాజిక వర్గాన్ని అవమానపరిచారన్నారు. మంత్రి పరమేశ్వర్, కలెక్టర్ జోక్యం చేసుకొని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు ఈరణ్ణ, బేకరి నాగరాజు, కరవే లక్ష్మీనారాయణ, బలరాం, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న బైక్ దొంగలు



హిందూపురం పట్టణంలోని ముక్కడిపేటకు చెందిన ఓ మహిళ రూపాయి రూపాయి కూడబెట్టుకుని తనకు ఇష్టమైన ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసింది. రోజూ రాత్రి పూట ఇంటి ముందే బైక్‌ను పార్కింగ్ చేసేది. ఈ నెల 15వ తేదీ రాత్రి సైతం ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేసింది. 16వ తేదీ ఉదయం లేచి చూసేసరికి వాహనం మాయమైంది. బండి చోరీకి గురైందని ఆవేదనకు గురై పోలీసులను ఆశ్రయించింది.

పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఓ యువకుడు తనకు ఇష్టమైన ద్విచక్ర వాహనాన్ని ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేశాడు. రాత్రి వేళల్లో ఇంటి వద్దనే పార్కింగ్ చేసేవాడు. ఈనెల 15వ తేదీ రాత్రి సైతం ఇంటి ముందు బైక్ ఉంచాడు. ఉదయం లేచి చూసేసరికి ద్విచక్ర వాహనం లేకపోవడంతో చోరీకి గురైందని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. తనకు ఇష్టమైన బైక్ చోరీకి గురికావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసి.. బండిపోయి ఈఎంఐలు మిగిలాయని వాపోయాడు.

- ఇళ్లు, షాపుల వద్ద నిలిపిన వాహనాలు క్షణాల్లో మాయం
- వరుస దొంగతనాలతో వాహనదారుల ఆందోళన
- రాత్రిపూట పోలీసు బీట్లు మరింత పెంచాలంటున్న ప్రజలు

హిందూపురం టౌన్: పట్టణంలోని ముక్కడిపేట, త్యాగరాజ్‌నగర్, చైతన్యనగర్, ఆర్‌పీజీటీ రోడ్డు, వీవర్స్ కాలనీ, అలాగే రద్దీగా ఉన్న పలు ప్రాంతాల్లోనూ ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. రెండు, మూడు రోజుల్లోనే పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఇందులో ఓ పోలీస్ బైక్ కూడా చోరీకి గురైనట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రిలోనూ పార్కింగ్ చేసిన వాహనాలు చోరీకి గురయ్యాయి. పట్టణ వాసులు ద్విచక్ర వాహనాలు ఇంటి నుంచి బయటకు తీయాలంటే భయపడిపోతున్నారు. రోడ్లపై, పార్కింగ్ ప్లేసుల్లో వాహనం నిలిపితే ఎక్కడ చోరీకి గురవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పార్కింగ్ చేసిన వాహనాలు పార్కింగ్ చేసినట్లే మాయమవుతుండడంతో వాహనాదారులు లబోదిబోమంటున్నారు.

నిముషాల వ్యవధిలోనే...

పట్టణంలో పెద్ద ద్విచక్ర వాహనాలే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. నిమిషాల వ్యవధిలోనే వాహనాలను దొంగలిస్తున్నారు. ఎంతో చాకచక్యంగా, సులభంగా వాహనాలను మాయం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇంటి వద్ద, ఆస్పత్రుల వద్ద, అలాగే రద్దీ ప్రాంతాల్లో నిలిపిన వాహనాలను ఎక్కువగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటిస్తూ వారి వద్ద ఉన్న వివిధ రకాల ద్విచక్ర వాహనాల తాళాలలో లాక్ ఓపెన్ చేసి ఎత్తుకెళుతున్నారు. హోండా షైన్, ప్యాషన్ ప్రో, పల్సర్ లాంటి వాహనాలను కొట్టుకెళ్తున్నారు. పార్కింగ్ చేసిన వాహనాలు పని ముగించుకుని వచ్చే లోపు మాయమవుతుండడంతో వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. పట్టణంలో పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలు చోరీ గురవుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసు బీట్లు సైతం తగ్గినట్లు వాపోతున్నారు.

కత్తిమీద సాములా వాహనాల మిస్సింగ్

హిందూపురం పట్టణ, రూరల్ స్టేషన్ల పరిధిలో ఇళ్లు, షాపుల దొంగతనాలతో పాటు ద్విచక్ర వాహనాల చోరీలు పోలీసులకు తలనొప్పిగా మారింది. రాత్రి వేళల్లో ఎక్కువగా వాహనాలు చోరీకి గురవుతుండడంతో సీసీ కెమెరాలలో దొంగలను గుర్తించడం కూడా పోలీసులకు కత్తిమీద సాములా మారింది. దొంగలు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారని, సీసీ కెమెరాలకు చిక్కకుండా తప్పించుకుంటున్నట్లు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాల చోరీతో హిందూపురంలో చోరీలకు కొత్త బ్యాచ్ దిగిందా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో దొంగతనాలతో సంబంధం ఉన్న వారిని అనుమానిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనాలపై ప్రత్యేక దృష్టి



ద్విచక్ర వాహనాల దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. రాత్రి సమయాల్లోనూ ఎక్కువ గస్తీను నిర్వహిస్తున్నాము. ఇటీవల ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి పలు వాహనాలను రికవరీ చేశాం. దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. పాతనేరస్తులపై సైతం నిఘా ఉంచాం.

– మహేష్, డీఎస్పీ హిందూపురం

వైఎస్ జగన్‌ను కలిసిన అశ్వత్థనారాయణ



మడకశిర: నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు, ప్రముఖ న్యాయవాది అశ్వత్థనారాయణ గురువారం రాత్రి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిశారు. మడకశిరలో పార్టీ పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నట్లు అశ్వత్థనారాయణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



పద్మనాభరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

గోరంట్ల: మండల పరిధిలోని ఎర్రబల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పద్మనాభరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆయన్ను శుక్రవారం పరామర్శించారు. ఆమె వెంట శెట్టిపల్లి మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, కాగానిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్‌రెడ్డి ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వద్రపాళ్యంలో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని వద్రపాళ్యంలోని ఓ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదని, చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయండి



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

హిందూపురం టౌన్: సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో వినియోగదారులపై భారం వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రూ.814 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను ట్రూ అప్ చార్జీల పేరుతో వినియోగదారులపై మోపేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. చరిత్రలో ఇంతలా ట్రూ అప్ చార్జీలు భారం వేయడం అనేది ఎప్పుడు లేదని, దీన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. అనంతరం ఏఈ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావాలి, సీఐటీయూ నాయకులు రాము, సదాశివరెడ్డి, పట్టణ నాయకులు ఆంజనేయులు, నందీశ్వర, నాగప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల భవనం



మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. తాజా కురుస్తున్న వర్షాలకు భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. అధికారులు వెంటనే మరమ్మతు చేయించి విద్యార్థులకు ఏ ప్రమాదం జరగకుండా చూడాలని స్థానికులు ఎంఈఓ కోరారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



చిత్తడైన మురారాయన హళ్లి రోడ్డు

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామ సమీపంలోని మురారాయనహళ్లి రోడ్డు వర్షం వస్తే చాలు బురదమయంగా మారుతోంది. దీంతో వాహనదారులు ఆ రోడ్డుపై వెళ్లేందుకు నరయయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతు చేసి మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు కాదు.. హైవే



చిలమత్తూరు: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్ డ్యాములే కాదు.. రహదారులు కూడా నీటితో నిండిపోతున్నాయి. మండలంలోని కోడూరు థామస్ మన్రోతోపు సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పై వర్షపు నీరు నిలిచిపోవడంతో రోడ్డు చెరువును తలపిస్తోంది.

పలుచోట్ల వర్షం



అగళిలో కురుస్తున్న వర్షం

అగళి/మడకశిరరూరల్: అగళి, మడకశిర మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం పడింది. ముఖ్యంగా కోతకు వచ్చిన మిరప, టమాట, పత్తి రైతులు తొలగించుకోవడానికి వీలు లేకపోవడంతో దిగుబడి వచ్చినా చేతికందకపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తూకాల్లో తేడా వస్తే చర్యలు



అగళి: వేయింగ్ మిషన్లను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి శివశంకర్

రొళ్ల: ప్రభుత్వ చౌకధాన్యపు డీపో డీలర్లు, వివిధ అంగళ్ల యజమానులు కంప్యూటర్ స్కేళ్లలో వినియోగదారులకు తూకాల్లో తేడా లేకుండా నిత్యావసర సరుకులు సక్రమంగా విక్రయించాలని హిందూపురం తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల వ్యాప్తంగా గల 26 చౌకధాన్యపు డీపోల డీలర్ల వద్ద ఉన్న స్కేళ్లను పరిశీలించి సక్రమంగా ఉన్నాయా లేదా అని నిర్ధారించుకున్న తర్వాత వాటికి సీల్ వేశారు.

అగళి: వ్యాపారులు తూకాల్లో వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హిందూపురం తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్‌పీ షాప్ డీలర్ల వేయింగ్ మిషన్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం దుకాణాల్లో ఉన్న వేయింగ్ మిషన్లను పరిశీలించి సీల్ వేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అగళి: మండల పరిధిలోని దాసేగౌడనపల్లిలో గురువారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.24,560 స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

23న రీసర్వేపై అవగాహన

లేపాక్షి: మండలంలోని మైదుగోళంలో జరిగిన రీసర్వేపై ఈనెల 23న రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు.

అభ్యసన వైకల్యంపై అవగాహన

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్దిష్ట అభ్యసన వైకల్యంపై ఎంఈఓ రాఘవయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వడంతో పాటు వారు ఉన్నత స్థాయిని చేరుకునేలా కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం.రఘు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పల్లె పండుగ

రొళ్ల: మండలంలోని హొట్టేబెట్ట పంచాయతీ పరిధిలోని హొట్టేబెట్ట, కల్లురొప్పం గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, కన్వీనర్ దాసిరెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండుగ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ ఓబుళప్ప, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, పంచాయతీ కార్యదర్శి పరమేష్, టీఏ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మార్పు

రొళ్ల: మండల పరిధిలోని ఎల్‌కేపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం నుంచి కె.బ్యాడిగెర ప్రాథమిక పాఠశాలకు మార్చినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఎల్‌కే పల్లి ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. విషయాన్ని డిప్యూటీ డీఈఓ రంగస్వామికి దృష్టికి తీసుకువెళ్లి తాత్కాలికంగా కె.బ్యాడిగెర ప్రాథమిక పాఠశాలకు మార్చామన్నారు.

సంక్షిప్త సమాచారం

భూసర్వేపై గ్రామ సభ

గోరంట్ల: మండల పరిధిలోని కాటేపల్లిలో గత ప్రభుత్వ హయంలో నిర్వహించిన సమాగ్ర భూసర్వేపై శుక్రవారం తహసీల్దార్ మారుతి ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన భూసర్వేలో రైతులు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటుంటే గ్రామ సభ దృష్టికి తీసుకొస్తే వాటిన పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ముగిసిన యత్తప్పస్వామి ఉత్సవం



అలంకరణలో యత్తప్పస్వామి

రొళ్ల: మండల పరిధిలోని గంతికల్లుగొల్లహట్టిలో వెలసిన యాదవుల ఆరాధ్య దేవుడు యత్తప్పస్వామి ఉత్సవాలు ముగిశాయి. శుక్రవారం ఉదయాన్నే యత్తప్పస్వామి మూల విగ్రహంతో పాటు చిత్రలింగేశ్వరస్వామి మూల విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

23న సర్వసభ్య సమావేశం

సోమందేపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మమతాదేవి తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువు గ్రామంలో తేనెటీగల దాడిలో నారాయణప్ప (65) గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రమాకాంత్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు.. నారాయణప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

హిందూపురం: స్థానిక ఎంజీఎం హైస్కూల్‌లో శనివారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కుమార్‌రాజా, ఉషారాణి తెలిపారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయిస్తామన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు.

20న మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం

జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల 20 ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్‌పీజీటీ రోడ్డులోని అల్ హిలాల్ స్కూల్‌లో మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఇటీ రామమూర్తి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం: మరమ్మతు పనుల కారణంగా పట్టణంలో శనివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈడీ-1 తెలిపారు. 33/11 కేవీ ఇండోర్, 33/11 కేవీ శ్రీకంఠాపురం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హొన్నంపల్లిలో పొలంబడి

పరిగి: మండలంలోని హొన్నంపల్లి, శాసనకోట గ్రామాల పరిధిలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ విజయభారతి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు పాటించాల్సిన నియమ నిబంధనలు పాటించి మంచి దిగుబడి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లలిత, పావని, ఆర్బీకే అసిస్టెంట్ హరీష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన వర్షం





నష్టపోయిన పంటను చూపుతున్న రైతులు, నాయకులు , అగళి: నల్లగా మారిన కాయలు , కట్టె

చిలమత్తూరు: రైతులను వర్షం నట్టేట ముంచింది. ఖరీఫ్‌లో వేరుశనగ 1110 హెక్టార్లలో సాగు చేయగా 50 శాతం మేర పంట దెబ్బతినింది. చిన్నపరెడ్డిపల్లిలో 50 మంది రైతులు సాగు చేసిన వేరుశనగ వర్షానికి పూర్తిగా దెబ్బతినడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మొక్కజొన్న 2,686 హెక్టార్లలో సాగు చేయగా వర్షాభావంతో చాలా ప్రాంతాల్లో పంట దెబ్బతింది. చిన్నపరెడ్డిపల్లిలో దెబ్బతిన్న పంటను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బృందం పరిశీలించింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అగళి: మండలంలో కురుస్తున్న వర్షాల దెబ్బకు ప్లాస్టిక్ కవర్లతో కప్పుకొన్న వేరుశనగ పంట బూజు పట్టిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసానికి కూడా పనికిరాకుండా పోయిందని వాపోతున్నారు.

దాడికేసులో మహిళకు రిమాండ్

రొద్దం: మండల పరిధిలోని శేషాపురం గ్రామంలో గత నెల 30న రైతు శ్రీనివాస్‌రెడ్డి దానిమ్మ తోటలో పశువులతో మేపి, రైతుపై దాడిచేసిన కేసులో వసుంధర అనే మహిళకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఈమేరకు ఆమెను అనంతపురం జిల్లా జైలుకు తరలించామన్నారు.

వాల్మీకి మహర్షికి పూజలు

అమరాపురం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద మహిళలు శుక్రవారం పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. వాల్మీకి మహర్షి జయంతి వేడుకల సందర్భంగా శనివారం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం సభ్యులు తెలిపారు.

డ్రైనేజీ ఏర్పాటు చేయండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ముందు వర్షపు నీరు ప్రవహిస్తుండంతో విద్యార్థులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, ఉపాధ్యాయులు కలిసి డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ నర్సేగౌడ్, గ్రామ కార్యదర్శి నర్సేగౌడ్‌లకు వినతిపత్రం అందజేశారు.